# సైలెన్స్ ప్లీజ్...

ఈతకోట సుబ్బారావు



'ఏవండోయ్...'

ఉలిక్కిపడ్డాడు పెద్దాయన. వొకసారి చుట్టూ చూశాడు. ఎవరూ లేరు.

'ఇంకా అలా చుట్టకాలుస్తూ ఎంతసేపు...?' మళ్లీ అదే స్వరం. కాస్త మూడోకన్ను తెరిస్తే కాని అర్థం కాలేదు అసలు విషయం.

ప్రతి సమర సంధ్య వేళ – అతను వొంటరితనాన్ని దులిపేసి తన జ్ఞాపకాల మ్యూజియంలోకి ప్రవేశిస్తాడు.

డైరీలో ప్రతిరోజూ ప్రాణం పోసుకునే వొకేవొక వాక్యమది. ఆ తర్వాత అనేక సంతకాలు అతని మనోఫలకంపైన గజిబిజిగా అల్లుకుంటాయి. శిశిరం కన్నీటి చుక్క రాల్చినా, ఎండుకొమ్మ మీద కోకిల గమకం తప్పినా, అక్షరాలు అలిగి ఓ మూల వొదిగి కూర్చున్నా, పలక పగిలిపోయిందని చిన్నోడు ఏడుస్తూ కళ్లు నులుముకున్నా, ఆవిడ అరచూపుల్తో వుడికించినా అన్నీ మనోఫలకంపైనే. ఒక్కోసారి తరగతి గదే బల్లలు పరచుకొని నిశ్శబ్దంగా బుద్ధిగా కూచుంటుంది మనోఫలకంపైన. విద్యార్థులంతా జిజ్ఞాసువుల్లా మౌనమహామునులై చెవుల్ని

సముద్రాలంత విశాలం చేసుకొని శిల్పాలై పోతారు.

ఒక పద్యం - లయబద్ధంగా, హృదయలయంత ఖచ్చితంగా గదిలో గోడలకి కూడా చెవులు పూయిస్తుంది. ఒక కవిత - నరాల ప్రవాహాల్లో విద్యుత్తును చిలికి వేడిపుట్టించి ఉప్పెనై పోతుంది. అంతా నిశ్శబ్ద గది పరిధిలోనే.

ఆయన ఆజానుబాహు ఆకారమే విద్యార్థుల పాలిట మంత్రదండం.

''అర్థం కాకపోతే చేతులెత్తండి వాళ్లకోసం మరో మారు చదువుతాను''.

ఎవరికీ అర్థంకాదు ఆయన పద్యం. క్లాసులో అన్ని చేతులూ పైకి లేస్తాయి, అదీ మౌనంగా.

వాళ్లకి కావల్సింది మరోసారి ఆ అమృతాన్ని తనివి తీరా గ్రోలటం.

సంస్కృత శ్లోకమైనా ఆయన వల్లించే పద్ధతిలోనే అర్థమై కూచుంటుంది - అనటం చిన్నమాట. గుండెల్లో ప్రింటైపోతుంది అన్నది సరైన మాట. అయినా దాహం తీరదు. నోట మాట పెగలదు. చేతులు అన్నీ పైకి లేచి కూచుంటాయి. మళ్లీ పద్యం పునర్జన్మెత్తుతుంది. పునరపి జననం. పునరపి శాంతం. క్లాసైపోతుంది.

క్లాసులన్నీ కబేళాల గావుకేకలై, పిచ్చాసుపత్రి కాంపౌండైపోయినపుడు అతను గదుల వరండాలో నడిచి వెళ్తుంటాడు. ఆయన అడుగుల చప్పుడు ఎవరికీ వినిపించదు. అయినా ప్రతి తరగతి గది తపోవనమైపోతుంది ఆయన గది దాటేంతవరకూ. ఆయన మాస్టారిగిరీ గిరిశిఖరమై నించున్నంత సుదీర్ఘకాలం ఆయన పుస్తకాల అరలో పేరుకుపోయిన డైరీల యే పేజీలోనూ కనిపించని రెండు పదాలు 'సైలెన్స్ ప్లీజ్...'

స్కూల్లోనే కాదు, కవి సమ్మేళనాల్లో, ఉపన్యాస వేదికలపైనా, స్టాఫ్ రూం నాలుగ్గోడల నడుమ, చివరికి అయినా, వినిపించని ఆయన అడుగుపడిన ప్రతి చోటా మౌనం ఆయనకు గౌరవ సూచకంగా జెండా ఎగరేసేది.

ఒక్క చిన్నోడే వసపిట్టగాడు. అనుమానాల వలలో చిక్కిన చేపలన్నీ ఆయన ముందు పరిచి వచ్చీరాని పలుకుబడితో బడిని ఇంట్లో పెట్టేవాడు.

''ఉc... ఉc.. మరే.. ఆరు చేపలెండి, వొకటి మాత్రం ఎందుకండీ ఎండలేదు. దానికి తలపాగరా?'' అనోసారీ -

''పిల్లీ పిల్లీ తగువు కోతెండుకు తీర్చిందండీ..? కోతికంటే నక్క తెలివైంది కదా? అసలు అడవిలో లాయర్లూ, జడ్జీలూ, కోర్టులూ వుండవా మన లాగా..?'' అని మరోసారీ -

చెప్పుకుంటూ పోతే వాడి అనుమానాలు లంగరెత్తిన పడవలే. పరిగెత్తడమే... ఆగడమంటూ వుండదెక్కడా. 'సూర్యుడికి తూర్పుదిక్కే ఎందుక్కావల్సి వచ్చింది. ఉత్తరాన్నైతే హిమాలయాలు అడ్డమా?' 'మనుషులంతా వొక్కలానే మాట్లాడుతుంటారు. పక్షులేంటి రకరకాల కూతలు కూస్తాయి... వాటికో భాష వుండదా? గ్రామరుండదా?' వాడి సందేహాలకి సమాధానాలున్నా ఆలోగానే అరమోడ్పు కళ్ళలో వుడికింపు... గుండెలో మోహాల వూరేగింపు. ఎంత పాండిత్యం వున్నా, అధమపక్షం అతనూ మనిషే కదా. మనిషన్న ఉప్పుకారాలు జిహ్వాని తాకుతూనే వుంటాయి.

అదంతా ఆయన జీవితంలోని వసంత రుతువు. ఇప్పుడు ఆకురాలు కాలమే. ఆయన చుట్టూ చేరిన భాషాదాహ సమూహం ఏమైపోయిందో? భుజాల పైన దుశ్శాలువలు కప్పిన అభిమాన సేన ఎక్కడికెళ్లిందో? ఆ సభలూ, ఆ సాహితీ సమావేశాలూ, ఆ అభిమానాలూ అన్నీ తామరాకు మీది చినుకులే.

ఇప్పుడు తను వొంటరి చెట్టు. ఆకులు రాలిపోయి, కొమ్మలు ఎండిపోయి, నామ్‌కేవాస్తే మిగిలిపోయిన జీవిత అవశేషం. ఇప్పుడు తన మ్యూజియమే తన ప్రపంచం! తరం మారి తనను గుర్తుపెట్టుకున్నవాడు పెళ్లినాటి అరుంధతీ నక్షత్రమైపోయాడు.

జీవితమంతా మౌనగీతమై పోయింది - ఇంటర్‌లో రామ్‌కిషోర్ లాగ. వింటర్‌లో మంచువాన లాగ.

తన కాలేజీలో గోల చేసినవాడొక్కడే. రామ్‌కిషోర్.. వొకే వొక్కసారి మందలించాడు 'పాఠం వినాల్సినపుడు మాటలేంటి?' అని. అంతే - ఆ తర్వాత అతను మూగ కోయిలైపోయాడు.

మ్యూజియంలో రామ్‌కిషోర్ ప్రత్యక్షమయ్యాడు. పెదవులపైన చూపుడువేలు. గౌరవంతో, అభిమానంతో, గురుభక్తితో వినయ నదిలా ప్రవహిస్తున్నాడు. చీకట్లో మెరుపులా మెరిసిపోతున్నాడు.

''రామ్‌కిషోర్?'' పలకరించాడు పెద్దాయన. మరుక్షణం అంతర్ధానమైపోయాడతను. చుట్టూ కలయజూశాడు పెద్దాయన. ఉవ్వెత్తుకు ఎగిసి విరిగిపడిన కెరటంలా వొక నిస్పృహ.

ఇప్పుడిక్కడ తనని గుర్తించే వాళ్లెవరున్నారు? ప్రశాంతి నిలయం వృద్ధాశ్రమంలో కన్నబిడ్డలు అసహ్యించుకున్న మోడుచెట్లు తప్ప ఇంకెవరున్నారని? ప్రశాంతి నిలయం నుంచి శాంతివనానికే పయనం. ఆప్యాయతలూ, ఆత్మీయతలూ, అనురాగాలూ, అనుబంధాలూ, త్యాగాలూ, సర్దుబాట్లు జీవిత యుద్ధమంతా తనతోనే పరిసమాప్తమైపోతుందేమో!

సాయంత్రం రాలిపోయిన పూవుల్లాగే మనుషులూ రాలిపోతారు.

ఉదయం ఆర్పేసిన దీపంలాగే ప్రాణాలు ఆరిపోతాయి.

కట్టె కాలిపోతుంది. పంచభూతాల రుణం తీరిపోతుంది. మళ్లీ జన్మ, మళ్లీ మరణం... మరో శోకం! మరో యుద్ధం!! మరో అపజయం!!!

ఒంటరితనం ఎడారిలో లేడిపిల్ల. తనూ వొంటరివాడే. తనచుట్టూ భ్రమావరణాలే. పలకరింపు, పులకరింతా తనకు అపరిచితాలైపోయాయి.

వొక్కరినైనా పలకరించాలి. తనకోసం వొక్కరైనా నిస్పృహ వదలాలి. వొక్క కన్నీటిచుక్క రాలాలి. ఆత్మ అంతరాంతరాల్లో అదే ఘోష... ఎన్నిసార్లు? ఇదెన్నో మారో? ఈసారైనా ఎవర్నో వొకర్ని పలకరించాలి.

ఒక చిరునవ్వు పంచుకోవాలి.

ఎదటి కళ్లల్లో ఓ మెరుపు చూసుకోవాలి.

పలకరింతే కదా పంచుకోను మిగిలిపోయింది. ఘనీభవించిన మౌనం తునాతునకలైపోతే వొక ఆత్మ స్పర్శ లభిస్తుంది. వొక మోహనరాగం పరిమళిస్తుంది.

పలకరింతే కదా అలసిన ప్రాణాలపైన వెన్నెల వాన.

ఇక మౌనానికి సెలవ్.

మ్యూజియంలో కిలికిరింతల సింఫోని. కొన్ని వేలు.. లక్షలు... కోట్లాది విహంగాల జాతర. కోట్లాది ఇంద్రధనువులు సంగమిస్తున్న సంధ్యాకేళీ. వెన్నెల జలపాతాల మేళా. ఇంతకీ మౌనం వరమా? శాపమా?

గంట కొట్టారు.

మ్యూజియంలోంచి ఎవరో విసిరేసినట్టు తన గదిలో తను.

అందరికీ ఆకలైనట్టుంది. చిన్నపిల్లల్లా హాల్లోకి పరుగులాంటి నడక. తనూ నడిచాడు - వొక్కర్నైనా పలకరించాలని. సంకల్పం వెయ్యేనుగులెత్తు బలం.

అదిగదిగదిగో... అల్ల.. ఆ ముసలాడైతే బాగుంటుందనిపించింది, లోతుకు పోయిన కళ్లు, గుంటలు పడ్డ చెంపలు, చూపుల్లో అన్వేషణ... పలకరింపుకోసమేనా అన్నట్టు.

అతడి పక్కనే కూచున్నాడు పెద్దాయన. పలకరించాలన్న తపన. మొదటి ముద్ద మింగటానికి ముందే పలకరించాలి. ఈ గోలలో ఆయనకు వినపడేంత పెద్ద గొంతుతో మాట్లాడాలి. స్వరం పెంచాలి.... తరగతి గదిలో లాగే..

''ఎన్నాళ్లనించీ ఈ వనవాసం... మీవాళ్లు...'' ఆ తర్వాత పెద్దాయన నోట మాట పెగల్లేదు వెనకనుంచి వినపడ్డ హెచ్చరిక తర్వాత.

''భోంచేయాల్సినపుడు మాటలేంటి? సైలెన్స్ ప్లీజ్...!''

వెనక రామ్‌కిషోర్... కాదు రామ్‌కిషోర్ లాంటి బెత్తం పట్టుకున్న వార్డెను... ఎవరైతేనేం.. సైలెన్స్ ప్లీజ్...!!

